# దీర్ఘసుమంగళీ భవ

ప్రియబాంధవి

"శ్రీసీతారామాభ్యాన్నమః...అమ్మా...! ఏకాదశీ సోమవారం... మృగశిర నక్షత్రం... వర్జ్యం రాత్రి ఏడు గంటలకు..."

"చాల్చాలే!... తెల్లారకుండానే తయారయేవ్... మీకు పనీ పాటూ లేదు. వెళ్లు వెళ్లు! తిథి, వార, నక్షత్రాలు నువ్వు చెప్పేదేమిటి? మా దగ్గరే ఉన్నాయ్ కేలండర్లు—దయచేయ్!"

"బాబూ— ముసలివాడ్ని. కరుణించాలి. తమలాంటి వాళ్లే ఇలాగంటే నాగతేమిటి?"

"వెళ్లవయ్యా— వెళ్లు. చెప్తుంటే నీక్కాదూ? పెద్ద విభూతి పిండికట్లూ— నువ్వూను! తెల్లారుతూనే నీ ముఖం చూడవలసి వచ్చింది ఖర్మ!... ఏం వెళ్తావా— లేదా?" అంటూ దభాల్ని తలుపు బిగించి లోనికి వెళ్లిపోయేడు రుసరుసలాడుతూ ఆ ఇంటియజమాని— పెద్ద భూకామందు.

ఎర్రగా నిగనిగలాడుతూ మెరుస్తూన్న రాగి చెంబులోకి నిట్టూరుస్తూ చూసేడు భిక్షువు.

అప్పటికి అది ఆరో గడపైనా, పాత్రలో ఒక్క గింజైనా లేకపోవటంతో కళ్లంట టప-టప కన్నీటి చుక్కలు రాలేయి. బారెడు ప్రొద్దెక్కుతూంది. శీతాకాలపు పైత్యపెండ— కండలు తిరిగిన వాళ్లనే జోపేస్తూంటే— కండలెండి, వయసు పండిన వృద్ధుల సంగతి చెప్పాలా?

తాను లేచిన వేళావిశేషం అంతే అనుకుంటూ వంగిన వడుమును చేతికర్ర ఊతతో పైకెత్తి మరో గడప వైపు వెళ్ళేడు. అప్పటికే చంకలోనున్న పంచాంగం చెమటతో తడిసింది. నుదుట దిద్దిన విభూతి రేఖలు... అతడి భవిష్యత్తులాగే అయోమయంగా చెరిగిపోయేయి. పైనున్న చింకి అంగవస్త్రం తన సంసారం జ్ఞప్తికి తెస్తూంది. దాంతోనే ముఖం మెల్లగా ఒత్తుకుని మరో గడప తొక్కేడు—శాస్త్రులు అనబడే ఆ వృద్ధ భిక్షువు.

లక్ష్మీదేవి అగ్రహారం నూరు గడపకి మించని చిన్న బ్రాహ్మణ అగ్రహారం. పేరుకు బ్రాహ్మణ అగ్రహారమైనా, బ్రాహ్మణ లోగిళ్లు పాతిక లోపే! ఏనాడో బ్రాహ్మణులక్కడ మోతుబర్లుగా ఉండేవారట. అందుకని బ్రాహ్మణ అగ్రహారమైంది. అదీకాక— పూర్వం ఒక రాజాగారు ఒక సోమయాజిగారికి యజ్ఞం చేసుకుంటానంటే— అతని విద్వత్తుకు సంతోషించి— ఆ అగ్రహారాన్ని దానంగా ఇచ్చేరట. అదే రాణీగారి పేర్న అగ్రహారంగా వెలిసింది.

అయితే కాలక్రమేణా నాలుగు జాతులూ కూడి బ్రాహ్మణ వాడ తగు మాత్రంగానే మిగిలింది. వారు కోటికి పడగెత్తక పోయినా—కూటికి లోపం లేని వారు. కులానికీ, విద్యకూ పేద కాని వారు. సిరిసంపన్నులు గాక పోయినా — సరస్వతీ పుత్రులు. 'ఇదం బ్రాహ్మ్యం—ఇదం క్షాత్రం' అన్నట్లు కలం ఒక చేత్తో — కొడవలి మరో చేత్తో పట్టేరే కాని ఒళ్ళు దాచుకోని శ్రామికులు వారు. అందుకే 'మట్టిని నమ్మిన జాతికి పొట్టకు లోపం ఉండద'ంటారు.

అలాంటి అగ్రహారంలో ఓ గడప రాంభొట్లు గారిది. ఆయన జటాంత స్వాధ్యాయీ— శుద్ధ వైదికుడూను. అతడు ఆంధ్ర — అమరాలు పుక్కిటి బట్టిన పండితుడు. వైదీకే అయినా, కడుపు నింపేందుకు కండలు కరిగించేరే తప్ప కాలు ముడుచుకునే కరణం కాలేదు—సంభావనలకు సిద్ధం కాలేదు! తాతల నాటి అయిదెకరాల మాగాణీ సాగు చేసేరే కాని — వైదీకానికి ఖరీదు కట్టి తిరుగరు. విత్తిన చేత్తో ఒకరి కిచ్చేరే కాని—చేయి చాచి తిరుగరు! గంటం పట్టినా — గంగడోలు దువ్వేరు. శాస్త్రాలు చదివినా శ్రమించేరు. నోటికొచ్చిన ముక్క చెప్పేవారు — చేతికొచ్చిన సాయం చేసేవారు. అదే ఆయన ఘనత



## ఆంధ్రుల కీర్తి పతాక ఎగరేసిన కాకినాడ అప్పారావు



భారతదేశంలోని అగ్రశ్రేణి ఫుట్‌బాల్ ఆటగాళ్లలోని "రైట్ ఇన్ సైడ్" లలో మేటిగా కొనియాడబడిన మామిడిపల్లి అప్పారావు కాకినాడలో ఆగస్టు 30 వ ప్వల్ప అనారోగ్య కారణంగా కన్నుమూశారు.

1920 లో కాకినాడలో జన్మించిన అప్పారావు తన 16 వ ఏటనే బెంగుళూరులో జరిగిన అఖిల భారత పోటీలలో ప్రతిభావంతంగా ఆడి తన జట్టు విజయానికి తోడ్పడ్డాడు. తర్వాత కలకత్తాలోని కాళీఘాట్ క్లబ్ ఆహ్వానంపై వెళ్లి మరింత విజృంభించారు. ఆ తర్వాత కలకత్తా ఈస్ట్ బెంగాల్ క్లబ్‌లో చేరి 14 సంవత్సరాలపాటు కలకత్తా ఫుట్‌బాల్ మైదానంలో విజయపతాకము ఎగురవేసిన ఘనుడు మన అప్పారావు. ఆ క్లబ్ సాధించిన విజయ పరంపరలకు అప్పారావు ప్రతిభే నంటే అతిశయోక్తి కాదు.

టైఫాయిడ్ కారణంగా 1948 లో లండన్ ఒలింపిక్స్‌లో పాల్గొన లేక పోయారు.

### విదేశాలలో....

సోవియట్ యూనియన్, రుమేనియా, ఆఫ్ఘనిస్థాన్‌లు పర్యటించిన భారత ఫుట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించిన ఆంధ్రుడు అప్పారావు.

ఆటలో ఒక్క ఫౌల్ వేయకుండా ఆడి ఎదుటి జట్టు క్రీడాకారుల అభిమానాన్ని కూడా దోచుకున్న దొడ్డమనిషి. ప్రేక్షకులు, పత్రికల ప్రశంసలే కాక డెన్నిస్ క్రాంప్టన్ లాంటి విదేశ క్రీడాకారుల అభినందనలు అందుకున్న మేటి క్రీడాకారుడు అప్పారావు మరణం క్రీడా లోకానికే తీరనిలోటు!

ఫోటో: వివరాలు

— ముకరమ్

పిత్రార్జితాన్ని ఊర్జితం చేసుకుని కుటుంబానికి ఏలోటూ రానిచ్చేవారు కాదు. తర తరాల ఆచారాలను త్రికరణ శుద్ధిగా ఆచరించేవారు. పసిడికి తావి అబ్బినట్లు— అతనికి దేవీ ఉపాసన కూడ ఉండేది. అందుచేత ఆయన పౌరాణికులే కాక — ఉపాసకులు కూడ. ఆయన సంసారం ఏమంత పెద్దది కాదు. తానూ —భార్యా— తలి చెడిన అప్పచెల్లెలూ—వంశోద్ధారకుడూ మాత్రమే.

ఆయన భార్య అన్నివిధాలా ఆయనకు సహధర్మచారిణి. భర్త మనోభావాలు తప్ప మరేభావమూ ఎరుగని అర్ధాంగి వారి వంశోద్ధారకుడు నీలకంఠశాస్త్రి. దేవీ వర ప్రసాదుడుగా తమ్మి కాంభొట్లుగారు— శాస్త్రికి తానే గురువై— విద్యా బుద్ధులు నేర్పేరు. తనంతటి వాడ్ని చేసేరు. తనకు

## దీర్ఘ సుమంగళీ భవ

చేదోడు వాదోడుగా పొలం పనుల్లో పెట్టి స్వంత సేరీలో— పనిపాట్లలో పాలికాపులతో కలిసి కష్టించి ఫలసాయం యింటికి చేర్చుకునేవారు.

ఏక భుక్తం కావటంవల్ల కాంభొట్లు గారు— మింట చుక్కలు పొడిచే వేళ— చుక్కల క్రింద వాకిట్లో— సన్నజాజులు విరిసేచోట— విద్యార్థులు కూచోగా— వేదాల వల్లె వేయింపించేవారు. ఒకోసారి విరిసిన వెన్నెట్లో— పారిజాతాల పరిమళాల మధ్య— వల్లె జనానికి పురాణాలు వినిపించేవారు. పరమార్థం బోధించేవారు. అందుకే ఆయన త్రోవంట వెళ్తూంటే అంతా చేతులెత్తి మ్రొక్కేవారు. ఆయనా నమస్కారం అందుకుంటూ చిరునవ్వుతో— వారి యోగక్షేమాలు అడిగేవారు— ఆశీస్సులిచ్చేవారు.

ఏటా దసరా నవరాత్రులు ఘనంగా జరిపే ఆచారం కాంభొట్లు గారిది. దేవీ ఉపాసకులాయె! నవరాత్రులు నెలరోజులున్నాయన్న దగ్గర్నుంచీ— ఏర్పాట్లు ఆరంభమయేవి. ఆ చుట్టుపట్ల జనానికి అవే తిరునాళ్లు. పది క్రోసులమేర నుంచీ, జనం నాటు బళ్లమీద వచ్చేవారు. రా తనక పగలనక ఆ నవరాత్రులలో జనబాహుళ్యం కాంభొట్లు గారిచ్చే దేవీ కుంకుమ కోసం కాచుకునేవారు. ప్రసాదం దొరకటంతో ప్రసన్నంగా తిరిగి వెళ్ళేవారు వారి ప్రసన్నతే కాంభొట్లు గారికి పంచ భక్ష్యాలున్నూ. ఆ కుంకుమ ధరిస్తే సకల పాపాలేగాక— సర్వ రోగాలూ పోతాయని ఆ పేద ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసమే ఆయనకు శ్రీరామ రక్ష!

ఎప్పటిలాగే ఆ ఏడు కూడ దేవీ నవరాత్రులు పెద్ద ఎత్తునే ప్రారంభించేరు. దేవీనవరాత్రులు దివ్యంగా జరుగసాగేయి. నిరతాన్నదానంజరిగిపోతూంది. మహాష్టమి. మహార్నవమీ కుంకుమ పూజ కనుల పండువగా జరిగింది. ప్రజలు తండోపతండాలుగా వచ్చేరు ఆ పూజ చూడటానికి. కాంభొట్లుగారి ముఖాన— ఆయన ముఖవర్చస్సుకు తగినట్లు వెండి రూపాయంత కుంకుమ బొట్టు— ఉదయాద్రి నుంచి లేచే బాల భాస్కరునిలా మెరిసిపోయేది. ప్రజలంతా సాష్టాంగ దండ ప్రమాణాలు చేసేవారు. ఆయన యందు వారి భక్తి భావం అలాంటిది.

విజయదశమి నాడు కూడ యథాప్రకారంగా స్నానాదులు ముగించి పూజలోకి వచ్చేరు కాంభొట్లుగారు. అలా ఆయన పూజ చేసి, ధ్యాన నిష్ఠలో ఉండగానే అపరాహ్ణం దాటింది. గుమి గూడిన ప్రజా సమూహం ఆయన నిశ్చలతను భంగపరచ లేదు. ఆయన ధ్యాన సమాధికి అంతరాయం కల్గలేదు. అలా నిశ్చల సమాధిలో నుండగానే ఆయన ప్రాణవాయువులు పరమాత్మలో విలీన మయేయి. పనికిరాని కట్టె మాత్రం దేవి పాదాల చెంత వాలిపోయింది. చెంతనే మడి వస్త్రాలతో కూర్చున్న నీలకంఠ శాస్త్రి దిగ్గున లేచి—తండ్రి శరీరాన్ని లేవనెత్త బోయి—బావురు మన్నాడు. అంతా చుట్టూ

మీరు నేడే సభ్యులుగా చేరండి!

SWAMY AYYAPPA GROUP
A.P.S.F.

స్వామి అయ్యప్ప గ్రూప్

ప్రారంభం:
15-10-78

మొదటి నెల రు. 18/-
తరువాత
రు11లు చొప్పున
12 నెలలు చెల్లించండి.
తరువాత రు 10/-
చెల్లించి
బ్యాంకు గ్యారంటీ
పొందండి!

ANDHRA PRADESH SAVINGS & FINANCE
RAJAHMUNDRY

ఆంధ్రప్రదేశ్
సేవింగ్స్ & ఫైనాన్స్
పి.బి.నెం.47
రాజమండ్రి-533101

బ్రాంచి :— టి.వి. రామసుబ్బయ్య పార్కు ఎదుట, బందరు రోడ్, విజయవాడ-2;
రీజనల్ ఆఫీస్ :— నాంపల్లి, స్టేషన్ రోడ్, 5-8-10, హైదరాబాద్;
బ్రాంచిలు :— కర్నూలు, ఆదోని, అనంతపూర్, కడప, రాజంపేట, ఏలూరు, నూజివీడు, కొయ్యలగూడెం, మండపేట, పాలకొండ, ఖమ్మం, కొత్తగూడెం, బూర్గంపాడు.

## దీర్ఘ సుమంగళీ భవ

చేరేరు. ఆయన కళ్ళల్లో చలనం లేదు. ప్రజలు హాహాకారాలు చేసేరు.

* * *

దహన సంస్కారాలు పూర్తి చేసుకుని ఇల్లు చేరేడు నీలకంఠ శాస్త్రి— విషణ్ణ హృదయంతో. ఇంట్లో తల్లి, మేనత్తల గోడు భరించరానిదైంది. వచ్చిన బంధువర్గమంతా ఏవో ఉపశమన వాక్యాలు చెప్తున్నా అవి జ్వలిస్తున్న అగ్నిలో నీటి బిందువుల్లా ఆవిరి అయిపోయేవి. తన దుఃఖాన్ని ఉపశమించుకోలేక విలపించ సాగేరు. తండ్రి అండను ఇన్నాళ్ళూ కాలం గడిపేడు తప్ప అతడికి అంత వయసేదీ ?

తండ్రి ఆజ్ఞను శిరసా వహించడం మినహా ఏ పనీ స్వయంగా నిర్వహించే అలవాటు లేదు అతడికి. ఇప్పుడు మరి తప్పనిసరి ! ఈ సంసార భారం అతడి నెత్తిన పడింది. హిమాద్రిలా తమ కుటుంబానికి అండగా నుండే తండ్రి మరి లేడు. ఆయన నిర్వహిస్తుండే పనులన్నీ ఇప్పుడు శాస్త్రి మీద పడటంతో గాభరాపడి పోయేడు.

అటు పొలం పనులూ, ఇటు రాత్రులందు విద్య నేర్చుకుందుకు వచ్చే శిష్యులకు విద్యాదానం— తను నాశ్రయించిన బీదా — బిక్కికి సహాయమూ, అన్నీఅతడే నిర్వహించుకోవాలి. ఎన్నో రాత్రులు ఒంటరిగా తండ్రికై దుఃఖించేడు. ఈ కార్య భారానికి దిగులు పడేవాడు.

అధైర్యం ముంచుకొచ్చేది. కాని— ఏది ఏమైనా తన తండ్రి ప్రతిష్ఠనూ, ఆయన ధర్మనిరతినీ గంగపాలు చేయరాదని భీష్మించుకున్నాడు. మనసు దిటవు చేసుకున్నాడు. విలపిస్తున్న తల్లి, మేనత్తలను ఊరడించేవాడు. తిరిగి— క్రమేణా తన నిత్య కృత్యాలకు అలవాటు పడక తప్పలేదు.

* * *

మూడు శిశిరాలు భారంగా దొర్లిపోయేయి. భర్త పోయిన ఆరునెలలు తిరగకుండా శాస్త్రి తల్లి ఇహలోకం చాలించి భర్త సాన్నిధ్యాన్ని పొందింది. 'పుణ్యాత్మురాలు' అన్నారంతా. శాస్త్రిని చూసి రెండు కన్నీటి బొట్లు రాల్చేవారు. తల్లినీ, తండ్రినీ గోల్పోయిన అభాగ్యుడయేడు శాస్త్రి. మిగిలిన విధవ మేనత్త బాధ వర్ణనాతీతం! ఆమె కనుల ముందే చెట్టంత తమ్ముడ్నీ, మరదల్నీ గోల్పోయింది. భూమికి భారంగా తానొక్కతే మిగిలి పోయేనని నిత్యం దుఃఖించేది.

అన్నీ మన ఇష్టప్రకారం జరిగితే మరి సృష్టి రహస్యం ఏముంది? భగవంతుని చిద్విలాసాలు అందరికీ గ్రాహ్యమయేనా! తల్లినీ, తండ్రినీ పోగొట్టుకున్న శాస్త్రి— మేనత్త బలవంతంవలన ఒకింటివాడయేడు. అతడికి వేలువిడిచిన మేనమామ కూతురు 'పార్వతి' అర్థాంగిగా ఆఇంట అడుగు పెట్టింది. ఆమె తండ్రి బహు కుటుంబీకుడేకాక బహు బీదవాడు కూడ. ఆయన ఆరవ కుమార్తె పార్వతిని చూసి— వారి స్థితికి జాలిపడి— శాస్త్రి ఆమెను వివాహమాడేడు. మహదానందంతో వివాహంచేసేడు కన్యాదాత. సత్సంప్రదాయం నుంచి వచ్చిన పార్వతి భర్త అడుగు జాడల్లోనే మెలిగేది.

శాస్త్రి మేనత్తకు కళ్ళలో అంతర్కుసుమాలు ఏర్పడటంతో చూపు పోయింది. ఆమె సపర్యలుకూడ పార్వతే చేయవలసి వచ్చేది. ఆమె భూదేవిలా ఎంతో సహనంతో సంసారందిద్దుకోసాగింది. అయితే—ఆఇంటికి శాస్త్రి వివాహమైనది మొదలుబంధువుల రాకపోకలు ఎక్కువయేయి. ఎక్కడెక్కడి బంధువులో వచ్చి— ఏవో నాలుగు అనునయ వాక్యాలుచెప్పి తమ పబ్బం గడుపుకునేవారు. చూస్తూ—చూస్తూ వాళ్ళను పొమ్మనలేడు. నెలలకొద్దీ తిష్ఠవేసే బంధువుల్ని మేపలేడు. ఇలా ఇరకాటంలో రోజులు వెళ్ళబుచ్చేవాడు.

రాబడి అంతా ఆ భూమి మీద గింజలే కద. ఏడాది పంటనూ నలుగురు బంధువులూ వచ్చి ఊడేస్తే అప్పులూ, తిప్పలూ తప్పవు కద. అదే అయింది శాస్త్రికి. అయితే మండు టెండలో పోయే బాటసారికి మర్రి నీడలా పార్వతి నెల తప్పిందన్న వార్త ఆ కుటుంబానికి వెన్నెల జల్లయింది.

ఈసారి కాంభొట్లుగారే తిరిగి ఉదయిస్తారన్నారు జనం... 'జన వాక్యంతు కర్తవ్యం' అన్నట్టుగా పార్వతి చక్కని కొడుకుని కన్నది. వాడికి కాంభొట్లు అనే నామకరణం చేసేరు. కాలాను గుణంగా పార్వతి వాడ్ని ఇంగ్లీషు చదువులో పెట్టమంది. వంశ పారంపర్యంగా వస్తుండే వైదీకాన్ని మాని

ఇంగ్లీషు చదువులో పెట్టేరు చిన్న కొంభొట్లును.

శాస్త్రి ఒక్కడే పొలం పనులు చూడటం కష్టం కాసాగింది. కూలికి పెట్టే పాలి కాపుల వల్ల ఎంత పని చేయించ గలడు? అందులోనూ, చేతిలో సొమ్ము ఆడటంలేదు. వయసు మీరుతున్న కొద్దీ ఆరోగ్యం క్షీణించ సాగింది పొలం పనులు సరిగా నిర్వహించ లేక పోవటంతో ఫలసాయం తక్కువ కాజొచ్చింది.

ఆ రోజుల్లోనే రత్తయ్యను చేరదీసేడు.

ఒకనాడు శాస్త్రి పొలం నుంచి వస్తూ ఉండగా కుంభవృష్టిగా వర్షం పడుతూంది. ఒక మర్రిచెట్టు నీడను తల దాచుకుందికి వెళ్ళేసరికి అక్కడ గజ గజ వణికిపోతూ చిన్న గోచీతో పదేళ్ళ కుర్రవాడు కన్పించేడు. 'రత్తిగాడు' దిక్కులేని స్థితిలో పొరుగూర్నించొస్తూ శాస్త్రికి తారసిల్లేడు. వాడికి భోజన సదుపాయలు గూర్చి తనింటి వద్దే స్థానం ఏర్పరచేడు. అంత చిన్నవాడికి భారీ పనులు వప్పగించలేక ఏవో చిన్న చిన్న పనులు మాత్రమే పురమాయించే వాడు

*   *   *

రత్తిగాడు—రత్తయ్యగా మారి శాస్త్రికి పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవాడు. వాడికీ వయసొచ్చింది. పొలాల గట్లమీద, చేలల్లోనూ, కాపు పడుచులతో సరసాలకి దిగేవాడు. ఈ వార్తలు కర్ణాకర్ణిగా విన్న శాస్త్రి రత్తయ్యను ఒకింటివాణ్ని చేస్తే మంచిదని పార్వతి తో సంప్రదించేడు.

రత్తయ్యకు మాత్రం ఇంకెవరున్నారని? తాము వాణ్ని ఎంతకాలం వంటరిగా ఉంచి పొలం పనులు చేయించగలరు? అందుచేత ఏదో ఒక మంచి పిల్లను చూసి ముడిపెడితే తమ భారంతీర్చినట వుతుందని ఆలోచించేరు ఆ భార్యాభర్తలు. వాళ్ళ ఆలోచనలలోకి వెంటనే వచ్చింది 'వరహాలు'.

ఆ ఊళ్ళో గురవయ్య అంత డబ్బున్న వ్యక్తి కాకపోయినా, మంచివాడని ప్రతీతి. ఇంతో—అంతో పొలంచెక్కనుదున్నుకుంటూ బ్రతుకుతున్నాడు. అతడికూతురే వరహాలు. మంచి వినయం — విధేయతా ఉన్నపిల్ల. పెద్దలయందు గౌరవం — పిన్నలయందు ప్రేమా ఉన్న ఆ పిల్ల — గుణవతే తప్ప రూపవతికాదు. ఈపిల్లను రత్తయ్యకిస్తే సుఖపడతాడని భావించాడు శాస్త్రి.

గురవయ్య దగ్గిర ఈ విషయం కదిపేడు శాస్త్రి. రత్తయ్యకు బొత్తిగా— ఏ భూమీ పుట్రా— లేనందున పిల నివ్వడానికి సంకోచించేడు గురవయ్య. శాస్త్రి ఆలోచనలో పడ్డాడు. వరహాలును ఇస్తే — ఈడూ, జోడూ బాగుంటుంది. రత్తయ్యకు ఆస్తిపాస్తులు లేకపోయినా— కండబలం— గుండె బలం ఉన్నవాడు. తనకూ— అండ—దండగా ఉన్నాడు. రత్తయ్యకు తానూ — ఇన్నాళ్ళ జీతం బత్తెం ఇవ్వలేదు. అందుచేత ఓ మడి చెక్క వాడి పేర వ్రాస్తే పుణ్యం— పురుషార్ధం దక్కుతుందని ఎంచేడు శాస్త్రి. పార్వతీ సరేనంది. ఆరాత్రి నిద్రలో – తన తండ్రికూడ దీనికి ఆమోదించినట్టు కల గన్నాడు శాస్త్రి. ఆ మరునాడే గురవయ్యతో ప్రస్తావించి వివాహం నిశ్చయించేడు రత్తయ్యకు.

వివాహం సలక్షణంగా జరిగిపోయింది.


పెరటి వైపున క్రొత్తగా పాక వేయించి అందులో రత్తయ్యా, వరహాలూ దంపతులను కాపురం పెట్టించేడు. వార్తూ మురిసిపోయేరు.

అప్పటివరకూ ప్రక్కఊరి హైస్కూల్లో చదువుకుంటున్న చిన్న కొంభొట్లు—మెట్రిక్ ప్యాసయి— కామేశ్వరరావు అయేడు. ఏదో మెట్రిక్ పేసయేడు కదా— ఇక తనకు సహాయంగా ఉండి— పొలం పనులు చూస్తాడనుకునే సరికి— పట్నంలో పై చదువులు చదువుతానని మొరాయించేడు. కొడుకు ముచ్చట తీర్చమని బ్రతిమాలింది భార్య పార్వతి. తన కొడుకు ఏ కలెక్టరో అయి హోదాగా ఉంటే చూచి ఆనందించాలను కుంది ఆ మాతృహృదయం. అంతేకాని— ఆ అమాయక హృదయానికి కొడుకును పట్నంలో ఉంచి కాలేజీ చదువులు చదివిస్తే అయే ఖర్చు అంచనా తెలియలేదు.

ఉన్న ఒక్క కొడుకు ముచ్చటా— భార్య మనసూ కాదనలేకపోయేడు శాస్త్రి. కొంత అప్పుచేసి కుర్రాణ్ణి కాలేజీలో చేర్పించి వచ్చేడు.

*   *   *

కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది




దాని గమనాన్ని ఆపే శక్తి ఏ మహామహులకూ లేదు. ఆ కాలగర్భంలో అనేక జీవితాలు కలిసి పోతుంటాయి. క్రొత్త జీవితాలు చిగురిస్తాయి. కాల గమనంతో సుఖదుఃఖాలు మారుతూండటం ప్రకృతి లక్షణం ఓడలు బళ్ళూ— బళ్ళు ఓడలూ అవుతాయని పెద్దల వాక్యం. ఆదిలో ఠీవిగా మీసం మెలివేసే చేతులే— దేహీ అని (చేయి) చాచవచ్చు. దేహీ అనే చేతులే రత్న కంకణా

[44వ పేజీ చూడండి]

డ్రా తేది 15-10-78

స్వామి అయ్యప్ప

SWAMY AYYAPPA GROUP
A.P.S.F.

గ్రూప్ లో

బహుమతులు
37,655.
బహుమతుల విలువ
రు. 6,47,425

ఉచిత బహుమతులు
రు.3,50,000

25% లాభం
స్వామి అయ్యప్ప
దేవాలయం కు
విరాళముగా
ఇవ్వబడును

ఆంధ్రప్రదేశ్
సేవింగ్ & ఫైనాన్స్
పి.బి.నెం.47. జె.పి.రోడ్డు.
రాజమండ్రి-533101

బ్రాంచి :— టి. వి. రాఘవయ్య పార్కు ఎదుట, బందరు రోడ్, విజయవాడ—2;
రీజనల్ ఆఫీస్ :— నాంపల్లి స్టేషన్ రోడ్, 5–8–10, హైదరాబాద్;
బ్రాంచీలు :— కర్నూలు, ఆదోని, అనంతపూర్, కడప, రాజంపేట, ఏలూరు, నూజివీడు, కొయ్యల గూడెం, మందడం, నల్గొండ, ఖమ్మం, కొత్త గూడెం, బూర్గంపాడు.

## దీర్ఘ సుమంగళీ భవ

(17వ పేజీ తరువాయి)

లతో ధగ— ధగ మెరవనూ వచ్చు. అది సృష్టి రహస్యం. ఇదంతా మా ఘనకార్యమే అనే విర్రవీగు మానవుడ్ని చూసి— భగవంతుడు చిఱునవ్వు చిందిస్తాడట—వారి వెర్రితనానికి జాలిపడి కాబోలు !

శాస్త్రి అనారోగ్యానికి తోడు— అడపా, తడపా పెద్ద మొత్తాలు కొడుకు కాలేజీ చదువుకు ఖర్చవుతూండటంతో సేరీ వ్యవసాయం సాగించలేక తన భూమిని రత్తయ్యకే కవులుకిచ్చేడు. కొంత భూమి అప్పులుతీర్చడానికిఅమ్మక తప్పలేదు. (అప్పు చేయడం... దురద లాంటిది. గోకిన కొద్దీ ఇంకా గోకాలనే ఉంటుంది. మంటలుపుట్టి వ్రణం అయితేనే కాని అసలు బాధ తెలిసి రాదు.) మిగిలిన భూమివల్ల వచ్చే అర్ధ భాగంతో సంసారం ఒడిదుడుకులతోనే నడపవలసి వచ్చింది. తన కొడుకు ప్రయోజకుడైతేచాలు. ఈ ధనం శాశ్వతమా— అని ఆలోచించేడు శాస్త్రి.

ఏటా దేవీ నవరాత్రులు జరిపిస్తూనే ఉన్నాడు. ఏదో యధాశక్తి తప్ప— తొలి అట్టహాసం— ఆనాటి వైభవం తేగలడా? అన్న సంతర్పణ జరపాలంటే— అర్థలోపం రాక్షసిలా పెనవేసుకుంది. నవరాత్రులు వస్తున్నాయనే సరికి తొలి ఆనందం అంతరించి— భయం ఆవరించేది. తన తండ్రి పేరు నిలపలేక పోతున్నాననే దిగులుతో కుళ్ళి కుళ్ళి యేడ్చేవాడు. ఎన్నో రాత్రులు తొలి వైభవాలు జ్ఞాపకం రాగా— నిద్ర పట్టేది కాదు.

ఆరోగ్యం క్రమేణా క్షీణించ సాగింది. దీనికి తోడు కొడుకు వద్ద నుంచి వచ్చే జాబులకు లెక్కలేదు. ప్రతి జాబులోనూ తన అవసరాలూ వాటికయేఖర్చులూ కావలసిన సొమ్ము పంపమనీ తప్ప తల్లి దండ్రుల యోగ క్షేమాలను గూర్చి ప్రసక్తే ఉండేది కాదు. ఆరోగ్యం బాగుంటే తిరిగి సేరీ వ్యవసాయం సాగించి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచు కునేవాడు: కాని మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు భార్య పార్వతి కూడ రోగగ్రస్తురాలయింది.

పార్వతికి 'మశూచి' తగిలి భర్త సాన్నిధ్యం వదిలి భగవంతునిలో లీనమైంది. ఈ దెబ్బతో హతాశుడయేడు శాస్త్రి. అతని నవనాడులూ ఒక్కసారి కృంగినట్లయేయి. విజయదశమి నాటి తండ్రి మరణం తలపుకు వచ్చింది, భోరుమని విలపించేడు. కొడుకు పేర తంతి వార్త పంపేడు. వాడు రెండో రోజున వచ్చి తల్లి మరణానికి దుఃఖించేడు. కర్మకాండ పూర్తవగానే కాలేజీ పోతుందంటూ వెంటనే వెళ్ళిపోయేడు.

ఆశని పాతాల్లా ... ఒకదాని వెంట మరొకటి వచ్చే కష్ట పరంపరలను ఎంత విజ్ఞుడైనా ఎదుర్కోటం సాధ్యమా ? సంఘటనల ఒత్తిడి మానవుడ్ని బలహీనుడిగా చేస్తుంది. ఎంతో దృఢ చిత్తుడైతే తప్ప వెల్లువలా వచ్చిపడే అఘాతాలను తట్టుకోవటం సులభమా ? దుఃఖ పరంపరలు మనిషిని నిస్సహాయునిగా చేస్తాయి. అయినా 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం' అని కదా పెద్దల సూక్తి. అందుచేత ఈ జీవుడున్నంత వరకూ ఈ కాయాన్ని పోషించక తప్పదు. అనుకుంటూ రోజులు భారంగా గడప సాగేడు శాస్త్రి. కొడుకు చదువు పూర్తి చేసుకుని ప్రయోజకుడైతే ఈ కష్టాలు కొంతైనా తగ్గుతాయి కదా అని పాపం ఆ కన్నతండ్రి ఆశ !

కాని-మనం తలచినదే దైవం సాగనిస్తే మరి ఆ జగన్నాటక సూత్రధారిని తలచే దెవరు ? అన్ని కష్టాలొచ్చినా ఉన్న ఆ ఒక్క మొలకా పెద్దదై తన దక్కరకొస్తే ఆనందించాలనుకున్న ఆ పితృహృదయం పట్నం నుంచి వచ్చిన వార్త విని — బండరాతి మీద పగలగొట్టిన భాండంలా— వికావికలైంది. తన కొడుకు ఎవరో కాలేజీపిల్ల ప్రేమలోపడి— ఆమెతో జరిపిన ప్రేమ కలాపాల పర్యవసానంగా— ఆమె మతంలో చేరి దూర ప్రాంతాలకు వెళ్ళిపోయినట్లు వచ్చింది ఆ వార్త !

ఉన్న ఆ ఒక్క ఆశా తునాతునకలై గాలికి కొట్టుకుపోతే ఏ తండ్రి హృదయం ఆక్రోశించదు? ఉన్న ఆ ఒక్క కొడుకూ తనకు కాకుండా పోతే ఆ తండ్రి ఆక్రందన కర్ణభేద్యం కాదా? అలాంటి తండ్రికి జీవితం మీద ఆశ ఎలా వుంటుంది? శాస్త్రికి పార్వతి పోయినప్పుడే వెన్ను విరిగినట్లయింది. ఇక ఈ కొడుకూ తనకు కాకుండా పోతే ఇక ఏం చూసుకు బ్రతకాలి?

చేసిన అప్పులు అప్పటికేతలమునిగి తాటి ప్రమాణం కావటంతో ఉన్న భూములు

# వారఫలం

— మహేష్

13-10-1978 శుక్రవారం మొదలు
19-10-1978 గురువారంవరకు

మేషం :— మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. వృత్తిలో శ్రమ కలుగుతుంది. చికాకులు యేర్పడతాయి. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం :— వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మిధునం :— ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం :— రావలసిన డబ్బు అందుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—సంతోషకరమైన వార్తలను వింటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం :— సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఆందోళనకు గురికాగలరు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

కన్య :— భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. సాటివారిలో గౌరవం దాగుంటుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారి పోవచ్చును. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

తుల :— సాటివారితో వాద ప్రతివాదాలు తగవు. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృశ్చికం :— వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. సాటివారితో వాద ప్రతివాదాలు తగవు.

ధనుస్సు :— మీ కార్యక్రమాలు అడావుడిగా ఉంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

మకరం :— వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. మీ మంచి తనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—అనుకూలమైన సమాచారం అందుతుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

కుంభం :— మీ శ్రమకు తగిన ఫలితంలభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మీనం :— వృత్తివ్యాపారాలు బాగుంటాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధు మిత్రులను కల్సుకొంటారు. ●

---

తెగనమ్మి చేతులు దులుపుకున్నాడు శాస్త్రి. మిగిలిన ఆ ఇల్లూ అమ్మి ఒక పాకలో కాపురం పెట్టేడు. ఏనాడో ఆత్మహత్య చేసుకునేవాడే! కాని— చదువుకున్న వాడు కావటంతో— తండ్రి పెంపకం వలనా— అలాంటి అజ్ఞానంలో పడలేకపోయేడు. అదీ కాక— ఎంతో వృద్ధురాలూ— కష్టాల తాకిడికి తట్టుకోలేక— అల్లాడుతూన్న మేనత్త గతో? ఆమె క్షుభిత హృదయానికి తాను కూడా లేకపోతే- ఇక ఏముంది? జీవచ్ఛవంలాంటి ఆమె బ్రతుక్కి ఈ మాత్రం అండకూడా లేకపోతే— ఆ పాపం తనది కాదూ? తన బొందిలో జీవం ఉండగా— ఆ మేనత్తకు సేవచెయ్యడంకన్న పరమార్థం ఏముంది? అదే తన కర్తవ్యం అని తన తండ్రి బోధిస్తున్నట్టుగా భావించి కళ్ళు తుడుచుకున్నాడు శాస్త్రి.

ఎక్కడో దూరాన— కొడుకు ఉద్యోగం చేస్తున్నట్టు కర్ణా— కర్ణిగా మాత్రమే విన్నాడు. ఆ వెళ్ళినవాడు మరి తిరిగిరాలేదు. అరుంధతి వంటి తల్లినీ, వశిష్ఠుని వంటి తండ్రినీ గోల్పోయి— ప్రాణ సమానమైన అర్ధాంగికి దూరమైన తర్వాత ఇక తను బ్రతికి ఉన్నా శవంతో సమానమే! అయిన ప్పటికీ ఇహలోకం వీడే. సమయం తనకింకా రాలేదు. తన మేనత్తకోసమైనా జీవించక తప్పదు— ఆ పిలుపు వచ్చేదాకా! ఇలా ధైర్యం చిక్కబట్టుకుని ఉపనయనం నాడు నేర్పిన వ్యాపకం ; అనుసరించక తప్పలేదు శాస్త్రికి.

* * *

"శ్రీ సీతా రామాభ్యాం నమః... అమ్మా!...ఏకాదశీ-సోమవారం...మృగశిర నక్షత్రం...వర్జ్యం రాత్రి ఏడుగంటలకు... అమ్మా! యాయవార బ్రహ్మణ్ణి."— అంటూ ఆ ఊరికి సంపన్నమైన మరో గడప ఎక్కేడు భిక్షువు.

నాలుగు గింజలు చెంబులో పడేవరకూ ఎన్ని గడపలైనా ఎక్కవలసిందే!

"వచ్చేవూ తెల్లారగానే?... శనిగొట్టులా!...నీ మూటా ముల్లెందాచ లేదిక్కడ—రోజూ ఇదేవరసా? దయచెయ్!" అని వరండాలో చుట్టకాల్చుకుంటూ వాలు కుర్చీలో కూర్చున్న వ్యక్తి ముఖం చిట్లించేడు.

"ఎవరదీ?...శాస్త్రిగారా! ఉండండి బాబూ వస్తున్నా"—అంటూ ఇంట్లో ఆ ఆసామీభార్య వీధిలోకి వచ్చింది.

చుర-చుర చూసేడు- రత్నాల ఉంగరాల వ్రేళ్ళతో కోరమీసం మెలివేస్తూ రత్నాల నాయుడు భార్యవంక.

"పట్టండి బాబగా!" అంటూగుమ్మం వద్ద మెట్లు దిగి చెంబులో ఉపాదానం వేసింది యజమాని భార్య వరహాలమ్మ!

"దీర్ఘ సుమంగళీ భవ!" అంటూ ఆశీస్సు లిచ్చేడు భిక్షువు. ●